క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



ధన్వాడ: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేసుకుంటున్నారని అధికారులు స్పందించి వాటిని సర్వేచేసి ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేయాలని శుక్రవారం సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగండ్ల వెంకటేష్, తహసీల్దార్ సింధుజాకు వినతి ప్రతం అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వేచేసి రిపోర్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, బాలయ్య, రమేష్, బాలరాజు, చిన్నరాజు పాల్గొన్నారు.

తిరుమలలో భజనమండలి సభ్యులు



ఊట్కూరు: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచారం ఆధ్వర్యంలో తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో మండలంలోని బిజ్వార్ ఆంజనేయస్వామి భజనమండలి భక్తులు శుక్రవారం పాల్గొన్నారు. ప్రతి ఏడాది రెండుసార్లు అఖండ సంకీర్తనలో పాల్గొనే అవకాశం వస్తుందని భజన మండలి అధ్యక్షుడు దొరొల్లకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. భజన కార్యక్రమంలో పాల్గొనేందుకు 21మంది భక్తులు ప్రత్యేక వాహనాలలో తిరుమలకు వెళ్లామని వారు తెలిపారు. భజన అనంతరం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించాలని వారు తెలిపారు. తరలివెళ్లిన వారిలో నర్సింహ, వెకంప్పగౌడ్, నాగిరెడ్డి, కట్టప్ప, రాజమౌళి తదితరులు ఉన్నారు.

బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక



దామరగిద్ద: బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని మొగుల్‌మడ్క గ్రామానికి చెందిన పల్లెబండ నర్సింహులు ముదిరాజ్‌ను నియమిస్తూ తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్రశాఖ అధ్యక్షుడు పాండు యాదవ్ నియామక పత్రాన్ని అందజేసినట్లు నర్సింహులు తెలిపారు. హైదరాబాద్ లంగర్ హౌస్‌లోని డివిజన్ విజయ్‌మహేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనపై విశ్వాసంతో రాష్ట్రశాఖ అధ్యక్షుడు తన రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ కులాల ఐక్యతకు హక్కుల సాధనకోసం తమవంతు కృషిచేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు.. నర్సింహులు ఎంపికపై పలువురు అభినందనలు తెలియజేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలను తీసుకొని రోగాలను తరిమేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా రెండో వార్డులో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వర్షాల కారణంగా నివాసాల పరిసరాల్లో వర్షపు నీరు చేరి దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రమ్ములు, హౌసులు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అమరచింతలో..



పర్యావరణ సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే మనకు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని డాక్టర్ రూపశ్రీ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా డాక్టర్ రూపశ్రీ మాట్లాడుతూ జీవ మనుగడ కేవలం మొక్కల సంరక్షణపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంటి ముందు మొక్కలను నాటి అవి ఏపుగా పెరిగే విధంగా నిత్యం నీరు అందిస్తూ కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రోహేల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి

- కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన
- అనుభవజ్ఞులైన అధ్యాపకులు.. సకల సౌకర్యాలు
- విద్యార్థులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రభుత్వ కళాశాల సిబ్బంది



రెనివట్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు (ఫైల్)

మద్దూరు: ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. అన్నివర్గాలకు, అన్ని సౌకర్యాలను కల్పించి ఉచితంగా విద్యను అందజేస్తోంది. అనుభవజ్ఞులైన లెక్చరర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి అన్ని సబ్జెక్టులను బోధిస్తున్నారు. నగరాలకు వెళ్లి అవస్థలు పడకుండా చాలా చోట్ల గ్రామాలు, మండల కేంద్రాల్లోనే ప్రభుత్వ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న చాలా మంది విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా ర్యాంకులు కూడా సాధిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించి మరింతమంది విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేందుకు ఉపన్యాసకులు గ్రామాల బాట పట్టారు. మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన కొనసాగుతుంది. అన్ని సబ్జెక్టులకు బోధించేందుకు పూర్తిస్థాయిలో లెక్చరర్లు ఉన్నారు. గతంలో ఈ కళాశాలలో అడ్మిషన్లు అధికంగా ఉండడంతో సీట్లు లభించడం కష్టంగా ఉండేది. ప్రస్తుతం గురుకులాలు, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్పొరేట్ కళాశాలవైపు చూస్తుండడంతో అడ్మిషన్ల సంఖ్య తగ్గుతోంది. దీంతో అడ్మిషన్ల కోసం లెక్చరర్లు గ్రామాల బాట పట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ ప్రచారం చేస్తున్నారు.

సౌకర్యాలు..

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన కొనసాగుతుంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 15మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో దాదాపు 210 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని తరగతులకు సరిపడా తరగతి గదులు, అత్యధునిక ల్యాబ్‌సౌకర్యం ఆటస్థలం, ప్రశాంత వాతావరణంలో కళాశాల ఉంటుంది.

నీట్, ఎంసెట్ కోచింగ్..

కళాశాలలో అనుభవం ఉన్న లెక్చరర్లతో ఉచిత విద్యాబోధన, పాఠ్యపుస్తకాలు పంపిణీచేయడంతో పాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఎంసెట్, నీట్ కోచింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదివిన చాలామంది విద్యార్థులకు నీట్, ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రీ సీట్లు వచ్చాయని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు బోధించడానికి ఉపన్యాసకులు అందుబాటులో ఉన్నారు. మూడు గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– మద్దిలేటి, ప్రిన్సిపాల్, మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యార్థులకు సరిపడా బస్సులు నడిపించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: నూతన విద్యాసంస్థల ప్రారంభం అవుతుండటంతో జిల్లాలో విద్యార్థులకు సరిపడా బస్సులను ఏర్పాటుచేయాలని పీడీఎస్‌యూ జిల్లా సహకార కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపోమేనేజర్ లక్ష్మిసుధాను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. బీద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యను అభ్యసించడానికి వస్తున్నారన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ సరిగ్గాలేకపోతే చిన్నపిల్లలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రూట్లలో సరిపడా బస్సులను నడిపించాలని కోరారు. మహాలక్ష్మి పథకం కారణంగా బస్సులు రద్దీగా ఉంటున్నాయని, విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బన్ని, మహేష్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేట రూరల్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టిపెట్టాలని తపస్ రాష్ట్ర నాయకులు గుంపుబాలరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి సంఘం తరపున వినతిపత్రం అందించారు. ఈ విద్యా సంవత్స రం సాఫీగా కొనసాగాలంటే బడి ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలని కోరారు. పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య చర్యలు ఎంతో ఇబ్బంది కల్గుతుందని, గతంలో మాదిరి స్కావింజర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, సెక్రటరీ నర్సింహ, జ్యోతి, రవికుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన అవసరం



కోస్గిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రామకృష్ణ



మరికల్‌లో విత్తన దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కోస్గి: మార్కెట్‌లో నకిలీ విత్తనాల నుంచి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రవంచలో రైతు వేదిక వద్ద రైతులకు నకిలీ విత్తనాలు, పచ్చిరొట్టే ఎరువులపై ఏఈఓ అజయ్‌తో కలిసి అవగాహన నిర్వహించారు. రైతులు లూజు విత్తనాలను కొనొద్దని, ప్యాకింగ్, కంపెనీ విత్తనాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. పంటకోసే వరకు ప్యాకింగ్‌ను భద్రపర్చాలని కోరారు. గ్రామాల్లో విత్తనాలు అమ్మడాని వస్తే తమకు సమాచారమివ్వాలన్నారు. అలాగే నేలను ఆరోగ్యంగా ఉంచడంతో పచ్చిరొట్టే పంటలు ఎంతో ఉపయోగపడుతాయని సూచించారు. ఈ పంట ద్వారా భూమిలో నత్రజనిని స్థిరీకరించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పంట పూత దశకు వచ్చేసరికి రోటివేటర్ ద్వారా కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రవంచ గ్రామ క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

మరికల్: ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి శివకుమార్, ఎస్ఐ మురళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీచేశారు. విత్తన డీలర్ల స్టాక్, రిజిస్టర్లు పరిశీలించారు. అలాగే రైతులకు అమ్మిన ప్రతి దానికి రసీదును అందజేయాలని సూచించారు. రసీద్ ఇవ్వకపోతే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

గాలొచ్చినా.. వానొచ్చినా కరెంట్ కట్

అమరచింత: గాలొచ్చినా.. వానొచ్చినా కరెంటు కష్టాలు తప్పడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడినా సమస్యను పరిష్కరించే అధికారులు కరువయ్యారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న విద్యుత్ అంతరాయాలు తప్పడం లేదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంతటి ఈదురు గాలులతో కూడిన వర్షాలు వచ్చినా కరెంట్ సరఫరా నిలిపేసే వారు కాదని, ప్రస్తుతం చీటికి మాటికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని విద్యుత్ వినియోగ దారులు వాపోతున్నారు. .అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



జాజాపూర్‌లో బడిబాటలో పాల్గొని అడ్మిషన్లు చేయిస్తున్న డీఎస్ఓ భానుప్రకాష్

నారాయణపేట రూరల్: ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం జరుగుతుందని తపస్ జిల్లా కో–షాధికారి కిశోర్ అన్నారు. మండలంలోని అమ్మిరెడ్డిపల్లి పీఎస్‌లో బడిబాట కార్యక్రమం కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా విద్యతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తుందని, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం పెడుతుందన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులకు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అదేవిధంగా మండలంలోని జాజాపూర్ జెడ్పీస్కూల్ ఆధ్వర్యంలో జరిగిన బడిబాటలో డీఎస్ఓ భానుప్రకాష్ పాల్గొని, ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రవేశాలు చేయించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, మాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మక్తల్: మండల కేంద్రంలో గుడిగండ్లలో బడిబాటలో భాగంగా రెండోరోజు శుక్రవారం ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి బడిలో చేరించే విధంగా విద్యా అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ఎవరూ పనిలో పెట్టుకోవద్దని కోరారు. ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా సర్కారు బడికే పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుపాదయ్య, రియాజ్‌ద్దీన్, హిమబిందు, పార్వతమ్మ, మణెమ్మ, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు ప్రగతిబాట వేయాలని కల్వాల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రసన్నకుమారి అన్నారు. శుక్రవారం కల్వాల్‌లో బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. చిన్నారులు ప్లకార్డులు పట్టుకుని గ్రామంలోని ప్రతివీధి తిరిగారు. ప్రతి సబ్జెక్టులో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థుల నమోదును చేపట్టారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయురాలు గీత, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని నోడల్ అధికారి వెంకటయ్య కోరారు. మండల పరిధిలోని ఉజ్జెల్లిలో శుక్రవారం బడిబాటలో భాగంగా ఇంటింటికి తిరిగి బడిబయటి పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అనేక మంది పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని, వీరిని పాఠశాలలు ప్రారంభం కాగానే తరగతుల్లో చేర్పిస్తామన్నారు. బడిఈడు పిల్లలను ఎవరైనా పనులో పెట్టుకుంటే చట్టరీత్యా శిక్షర్హులు అవుతారని హెచ్చరించారు. ఉపాధ్యాయులు సాయిబాబా, మహేష్, ఆరుణ, రామకృష్ణ, భవ్యశ్రీ, కృష్ణవేణి, స్వప్న, జ్ఞానేశ్వరి, సీఆర్పీ ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో మద్దూరు, కొత్తపల్లి, రెనివట్ల, చెన్నారెడ్డిపల్లి, పల్లెర్ల, నిడ్జింత తదితర గ్రామాల్లో పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ ద్వారా పిల్లల వివరాలను సేకరించి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మక్తల్‌లో..



మాగనూర్‌లో..



నర్వలో..



కొత్తపల్లిలో

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పేటలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శ్రీదేవి



గ్రామస్తులకు వివరిస్తున్న ఎస్ఐ-2 కృష్ణయ్య

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైదిక పాఠశాలలో ఎస్ఎస్ఆర్ సమ్మర్‌క్యాంప్‌లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ మత్తుపదార్థలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపించొద్దని, విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, గృహహింసా చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు. మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ బాలరాజు, ఎస్ఎస్ఆర్ డైరెక్టర్ చంద్రశేఖర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరికల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ-2 కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని జిన్నారంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్ గంజాయి గుట్కా మద్యపానం వాటి వాటికి దూరంగా ఉండాలని వివరించారు. దొంగతనాలు నిర్మూలన గురించి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు నాటుదాం



పగిడిమారి రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న అధికారులు

ఊట్కూరు: ఇంటింటికీ మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షిద్దామని ప్రత్యేకాధికారి కొండన్న అన్నారు. శుక్రవారం మండలంలోని పగిడిమారి గ్రామంలో రహదారి పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ నర్సరీలో సుమారు పదివేల మొక్కలను పెంచడం జరిగిందని, ఇండ్ల పరిసరాలలో పొలాల గట్టున, రోడ్ల పక్కన మొక్కలు నాటాలని ఆయన కోరారు. పచ్చదనాన్ని పరిరక్షించడంతో పర్యావరణాన్ని కాపాడినవారవుతామని భవిష్యత్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాఫర్, టీఏ గోపాల్, మొగులప్ప, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



చిన్నవాగు సమీపంలో ప్రమాదకర మలుపు

మాగనూర్: గ్రామీణ రోడ్ల అభివృద్ధికోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. కానీ ప్రమాదకర మలుపులను మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని మాగనూర్ – వర్కూర్ గ్రామాల మధ్య మాగనూర్ చిన్నవాగు సమీపంలో మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పంచాయతీరాజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టి



పాన్‌గల్‌లో కాల్వలో చెత్త, చెదారం, జమ్ము తొలగిస్తున్న ఉపాధి కూలీలు



సింగంపేటలో పాటు కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అమరచింత: వర్షాకాలంలో వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో ఇంకుడుగుంతలను నిర్మించాలని, ఇందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సింగంపేటలో జరుగుతున్న పాటు కాల్వలో పూడిక తీత పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పెద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు పాల్గొన్నారు.

మురికి కూపంగా..

పాన్‌గల్: మండల కేంద్రంలోని వైన్ షాపు సమీపంలో ఉన్న మురుగు కాల్వలో చెత్త, చెదారం చేరడంతో జమ్ము మొలిచి దుర్వాసన వెదజల్లుతుందని, వాటి తొలగించి కాల్వను శుభ్రం చేశామని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. గ్రామం నుంచి వచ్చే మురుగు, వర్షపు పాటు నీరు మొత్తం ఇదే కాల్వ గుండా ప్రవహించాలి. దీంతో ఈ కాల్వలో పేరుకపోయిన చెత్త, చెదారం, జమ్ముతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుందని కాల్వ పరిసరాలల్లోని గృహ యజమానులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. అయినా పారిశుద్ధ్య కార్మికులు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దానిలో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త, చెదారం నిండిపోయింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఉపాధి కూలీలను పెట్టి ఆ కాల్వను శుభ్రం చేయించారు. దుర్వాసన వస్తున్న కాల్వను శుభ్రం చేసిన ఉపాధి కూలీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

గండీడ్: భారతీయ జనతా పార్టీ గెలుపునకు కృషి చేసిన మండల, జిల్లా, తాలుకా నాయకులకు ధన్యవాదాలు తెల్పుతున్నట్లు మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీ ఇచ్చి చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లోనూ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు.